క్లుప్తంగా

నేత్రపర్వం.. కృష్ణరూపం



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో రాధాకృష్ణులు ప్రత్యేక అలంకరణలో దర్శన మిచ్చారు. మందిరంలో ఆదివారం వారాంతపు పూజలు కనులపండువగా జరిగాయి. హరేకృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి లీలలు, మహిమలను వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపనలు చేశారు.

అభయాంజనేయ స్వామి ఆలయంలో అన్న సమారాధన

తగరపువలస: ఆనందపురం మండలం నేలతేరు అభయ ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం అన్నదానం జరిగింది. బాలభాను అర్చక సంఘం అధ్యక్షుడు కామేశ్వరశర్మ ఆధ్వర్యంలో ఏటా కార్తీకమాసంలో 45 దేవాలయాలలో అన్నదానం చేయడం ఆనవాయితీ. అందులో భాగంగా ఇక్కడ అన్న సమారాధన నిర్వహించినట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో మిరియాల సంతోష్‌కుమార్, బంక సూర్యనారాయణ, పాండ్రంగి అప్పారావు, రౌతు శ్యామల, వెంకటరావు, కృష్ణంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కుంతీ మాధవుని ఆలయంలో రామాయణ పారాయణం

పద్మనాభం: పద్మనాభంలోని కుంతీ మాధవ స్వామి ఆలయంలో ఆదివారం రామాయణ పారాయణం జరిగింది.. శ్రీభాష్యం అప్పలాచార్యుల శిష్యులు 40 మంది ఈ పారాయణం చేశారు. ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు రెండు గంటల పాటు పారాయణం జరిగింది.

జ్ఞాన దీపాలను వెలిగించాలి



రేఖవానిపాలెంలో ప్రచారం నిర్వహిస్తున్న విజయరాంపురం కమిటీ ప్రతినిధులు

తగరపువలస: కార్తీక మాసంలో ప్రతి ఒక్కరూ దీపాలు వెలిగిస్తారని, అయితే దీపాలు వెలిగించడంలో జ్ఞానాన్ని అందరూ గ్రహించాలని ఇందూ జ్ఞానవేదిక విజయరాంపురం కమిటీ అధ్యక్షుడు కె.త్రినాధరావు సూచించారు. ప్రతి ఒక్కరూ తమ హృదయాల్లో జ్ఞాన దీపాలను ప్రకాశింపజేయాలన్నారు. త్రైత సిద్ధాంత భగవద్గీత, ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞానవేదిక విజయరాంపురం కమిటీ ప్రతినిధులు ఆదివారం ఇంటింటా ప్రచారంలో భాగంగా భీమిలి మండలం రేఖవానిపాలెంలో భగవద్గీత గురించి తెలియజేశారు. ఈ సందర్భంగా త్రినాధరావు మాట్లాడుతూ కార్తీక సోమవారం, దీపారాధన విశిష్టత గురించి వివరించారు. బి.పైడన్న, జి.సన్యాసి, కె.సంతోష్, లక్ష్మి, రాజు పాల్గొన్నారు.

బస్ షెల్టర్లు ఏర్పాటు చేయాలి

తగరపువలస: తగరపువలస కూడలి, వెంకటేశ్వరమెట్ట వద్ద ప్రయాణికుల సౌకర్యార్థం విశాఖ, విజయనగరం వైపు వెళ్లే ప్రయాణికులకు బస్‌షెల్టర్లు నిర్మించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు అంబేడ్కరు కూడలి వద్ద ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ షెల్టర్లు లేని కారణంగా ప్రయాణికులు నిత్యం ఎండావానల్లో ఇబ్బంది పడుతున్నారన్నారు. అంబేడ్కర్ కూడలిలోని పోలీస్ అవుట్ పోస్టును చిట్టివలస వైపు తరలించి, అక్కడ బస్ షెల్టర్ నిర్మించాలన్నారు. దీనిపై జిల్లా ఆర్టీసీ అధికారులతో పాటు భీమిలి పోలీసులు స్పందించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కానూరి రాంబాబు, మోర అప్పలరాజు, అల్లం గోవిందరావు, రామారావు, చిన్నారావు, లక్ష్మణరావు, వీర్రాజు, సన్నిబాబు తదితరులు పాల్గొన్నారు.

రింక్‌లో రాకెట్‌లా..

స్కేటింగ్‌లో దూసుకుపోతున్న లోహిత్‌రెడ్డి

జాతీయ స్థాయిలో 27 పతకాలు సొంతం

డిసెంబర్‌లో పోటీలకు సన్నద్ధం



సాధించిన సర్టిఫికెట్లు, పతకాలతో లోహిత్‌రెడ్డి



తగరపువలస: ఆర్టిస్టిక్ స్కేటింగ్‌లో రాకెట్‌లా దూసుకుపోతున్నాడు ఈ చిచ్చరపిడుగు. వయసు ఎనిమిదేళ్లే అయినా జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు సాధించి శభాష్ అనిపించుకుంటున్నాడు.

భీమిలి మండలం కొత్త మూలకుద్దుకు చెందిన ఎనిమిదేళ్ల బొల్లెంకుల లోహిత్‌రెడ్డి స్కేటింగ్‌లో మెరుపులు మెరిపిస్తున్నాడు. ఇప్పటి వరకు మొహాలీ, బెంగళూర్, చెన్నై, కోయంబత్తూర్ (పొలాచీ)లలో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని 10 స్వర్ణ, 11 రజత, 6 కాంస్య పతకాలు కలిపి మొత్తం 27 పతకాలు గెలుచుకున్నాడు. ఇవే కాకుండా జిల్లా, రాష్ట్ర స్థాయిలోనూ ఎక్కువ సంఖ్యలో పతకాలు, సర్టిఫికెట్లు సాధించాడు. డిసెంబరు 5 నుంచి 10వ తేదీ వరకు కోయంబత్తూర్ (పొలాచీ)లో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు మరోమారు సిద్ధం అవుతున్నాడు. 7 నుంచి 9 ఏళ్ల వయసు కలిగిన క్యాడెట్ బాయ్స్ కేటగిరీలో ఫిగర్, ఫ్రీ, పెయిర్, సోలో డాన్స్, కపుల్ డాన్స్ స్టైల్‌లో లోహిత్‌రెడ్డి రాణిస్తున్నాడు.

మూడేళ్ల వయసు నుంచే.. మూడేళ్ల ప్రాయంలో స్కేటింగ్ శిక్షణలో ప్రవేశించిన లోహిత్ రోజూ ఉదయం 5 గంటల నుంచి 6.30 గంటల వరకు, సాయంత్రం వేళ 6 గంటల నుంచి 9 గంటల వరకు శిక్షణ పొందుతున్నాడు. సెలవు రోజుల్లో అదనంగా ఉదయం 7.15 వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 వరకు శిక్షణ తీసుకుంటున్నాడు.



స్కేటింగ్ రింక్‌లో లోహిత్‌రెడ్డి

శివాజీ పార్కులో సాధన..

లోహిత్‌రెడ్డి సోదరి కార్తీక శరణ్య కూడా స్కేటింగ్ క్రీడాకారిణే. ఈమె ప్రస్తుతం సబ్ జూనియర్స్(11 నుంచి 14 ఏళ్ల) విభాగంలో పాల్గొని, రాణిస్తోంది. లోహిత్, శరణ్యల మెరుగైన సాధన కోసం వారి తల్లిదండ్రులు అప్పన్నరెడ్డి, రత్నకుమారి నగరానికి మకాం మార్చారు. ఎంవీపీ కాలనీలోని సత్యసాయి స్కూల్లో కార్తీక శరణ్య 8వ తరగతి, లిటిల్ ఏంజిల్స్‌లో లోహిత్‌రెడ్డి 4వ తరగతి చదువుతున్నారు. జాతీయ స్థాయి పోటీలు సమీపిస్తుండటంతో లోహిత్ శివాజీపార్కు ప్రాంతానికి చెందిన చిట్టిబాబు, సత్యనారాయణ వద్ద శిక్షణ పొందుతున్నాడు.

కష్టమైనా ఇష్టంగా ..

స్కేటింగ్ మాలాంటి మధ్య తరగతి కుటుంబాలకు శక్తికి మించినది. ఒక్కో ఈవెంట్‌కు జాతీయ స్థాయిలో రూ.1.50 లక్షల వరకు, జిల్లా, రాష్ట్ర స్థాయిలో రూ.60 వేల వరకు ఖర్చు అవుతుంది. కాస్ట్యూమ్స్, ట్రావెలింగ్, నాలుగు రోజుల పాటు వసతి, క్లబ్ ఫీజులు భరించాలి. ఇప్పటి వరకు స్పాన్సర్‌షిప్ కోసం ఎవరినీ సంప్రదించలేదు. మా చిన్నారులను తాతయ్య ఆదినారాయణ, నాన్నమ్మ తోటమ్మ కూడా ఎంతగానో ప్రోత్సహిస్తున్నారు. భవిష్యత్తులో లోహిత్‌రెడ్డి ఇంటర్నేషనల్ స్థాయిలో సత్తా చాటడానికి మేము మరింత శ్రమిస్తాం. ఎంత కష్టమైనా భరిస్తాం. మారుమూల గ్రామమైన మూలకుద్దు నుంచి కూడా లోహిత్‌రెడ్డికి లభిస్తున్న ప్రోత్సాహం మాలో ఉత్సాహాన్ని నింపుతోంది.

–అప్పన్నరెడ్డి, రత్నకుమారి
(లోహిత్ తల్లిదండ్రులు)



రెండో రోజూ బడ్డీల తొలగింపు



బడ్డీలను తరలిస్తున్న సిబ్బంది

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు రామాద్రి వద్ద మత్స్యకారులు ఏర్పాటు చేసుకున్న దుకాణాల తొలగింపు రెండో రోజూ కొనసాగింది. జీవీఎంసీ, రెవెన్యూ, పర్యాటకశాఖ, పోలీసు అధికారులను ఇక్కడ మత్స్యకారులు ఎంత వేడుకున్నా కనికరించే పరిస్థితి కనపడలేదు. తాము ఎంతో కష్టపడి జీవనం కోసం ఏర్పాటు చేసుకున్న బడ్డీల తొలగింపే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడిందని ఇక్కడి మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మాట తప్పిన గంటా

వాస్తవానికి ఈ దుకాణాల తొలగింపు శనివారం ఉదయం శిలాతోరణం వద్ద నుంచి ప్రారంభమైంది. సాయంత్రం కావడంతో కొన్ని బడ్డీలను తొలగించలేదు. దీంతో ఇక్కడి మత్స్యకారులు, స్థానిక టీడీపీ నాయకులతో కలసి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును కలిశారు. తీరం వెంబడి ఏర్పాటు చేసుకున్న 45 దుకాణాల్లో 35 తొలగించారని, మిగిలిన 10 దుకాణాలను ఆదివారం తొలగిస్తామని అధికారులు తెలిపినట్లు ఎమ్మెల్యేకు తెలిపారు. ఇదిలా ఉండగా ఆదివారం మిగిలిన దుకాణాలను తొలగించకుండా చర్యలు చేపడతానని, మత్స్యకారులు ఆందోళన చెందాల్సిన పనిలేదని గంటా శ్రీనివాసరావు మాటిచ్చారు. అయితే, అధికారులు ఆదివారం యథావిధిగా దుకాణాల తొలగింపు చేపట్టారు. దీంతో స్థానిక టీడీపీ నాయకులు గంటాకు ఫోన్ చేసినా కనీసం స్పందించలేదు. దీంతో గంటా మాట తప్పారని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేశారు.

మత్స్యకారుల సమస్యను త్వరగా పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న గంటా నూకరాజు, వాసుపల్లి కొండబాబు

భీమునిపట్నం: భీమిలి తీర ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న ఆక్రమణల సమస్యను ఎమ్మెల్యే గంటా శ్రీనివారావు త్వరగా పరిష్కరించాలని స్థానిక మత్స్యకారుల గ్రామాభివృద్ధి సేవా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గంటా నూకరాజు, వాసుపల్లి కొండబాబు కోరారు. భీమిలి ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లా మత్స్యకారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో పది రోజులుగా రిలే దీక్షలు పెద్ద ఎత్తున జరిగాయన్నారు. ఇక్కడ సీఆర్‌జెడ్ నిబంధనల ఉల్లంఘనతో పాటు మత్స్యకారుల శ్మశానవాటికను కూడా కబ్జా చేయడం దారుణమని పేర్కొన్నారు. దీనిపై తాము చేపట్టిన ఆందోళనకు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు స్పందించి సమస్య లేకుండా చూస్తానని హామీ ఇచ్చారని, అన్నమాటను నిలబెట్టుకోవాలని కోరారు. సమావేశంలో ముఖ్య నాయకులు వాసుపల్లి గరగయ్య, కారి చిన్నారావు, పుక్కళ్ల ఎల్లారావు, నక్కా రవి, దూడరాజు, గంటా ఎల్లాజీరావు, పుక్కళ్ల అమ్మోరు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిపై కూటమి నాయకుల కన్ను



ప్రభుత్వ స్థలంలో ఇంటి నిర్మాణానికి తీసిన గోతులు

తగరపువలస: ఆనందపురం మండలం లొడగలవానిపాలెం పంచాయతీ సర్వే నంబర్ 270లోని ప్రభుత్వ స్థలాలపై కూటమి నాయకుల కన్ను పడింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇళ్లు లేని పేదలకు స్థలాలు కేటాయించిన ఈ ప్రాంతంలో మిగిలిన అవసరాలకు పాక్షికంగా ఖాళీ స్థలాలు వదిలివేశారు. ఆ ఖాళీ స్థలాలను రాత్రివేళ కొందరు ఆక్రమించి, నిర్మాణాలు చేపడుతున్నారు. రెవెన్యూ అధికారులు స్పందించి ఆక్రమణకు గురవుతున్న స్థలాలను రక్షించాలని, హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేయాలని పంచాయతీ వాసులు కోరుతున్నారు.

సాగరతీరంలో సందర్శకుల సందడి

కొమ్మాది: కార్తీకమాసం, ఆదివారం కావడంతో తీర ప్రాంత పర్యాటక ప్రాంతాలు జనాలతో పోటెత్తాయి. సాగర్‌నగర్ బీచ్, రుషికొండ బీచ్, తొట్లకొండ, బావికొండ, రామానాయుడు ఫిల్మ్ స్టూడియో, మంగమారిపేట బీచ్, భీమిలి బీచ్, ఎర్రమట్టి దిబ్బలు ప్రాంతాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు పర్యాటకుల సందడి నెలకొంది. చిన్నారుల కేరింతలు, ఆటపాటలతో తీర ప్రాంతాల్లో సందడి నెలకొంది.



రుషికొండ తీరంలో పర్యాటకుల తాకిడి

ఉల్లాసంగా ఆర్యవైశ్యుల వనసమారాధన



పోటీల్లో విజేతలకు బహుమతులు అందిస్తున్న ఆర్య వైశ్యసంఘం నాయకులు

పీఎం పాలెం: ఆర్యవైశ్య యువజన సంఘం, నాయకుల ఆధ్వర్యంలో స్థానిక సాంకేతిక ఇంజినీరింగ్ కాలేజి గ్రౌండ్‌లో ఆదివారం భారీ ఎత్తున కార్తీక వన సమారాధన నిర్వహించారు. సంఘం పెద్దలు మాట్లాడుతూ ఏడాదికోసారి ఏర్పాటు చేసే ఇటువంటి కార్యక్రమాలు అందరిలో ఉత్తేజం నింపుతాయన్నారు. కార్యక్రమంలో భాగంగా పలు పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. లక్కీ డ్రా తీసి విజేతలకు బంగారు, వెండి ఆభరణాలు గృహోపకరణాలు తదితర విలువైన వస్తువులు అందించారు. సుమారు 1500 మందికి పైగా హాజరైన కార్యక్రమంలో నగర ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు దుర్గా సోమేశ్వరరావు, కార్యదర్శి కేఎస్.రామారావు, పిక్నిక్ నిర్వహణ కమిటీ కన్వీనర్ పాలూరి వరప్రసాద్, కంకటాల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



నృత్య ప్రదర్శన ఇస్తున్న కళాకారులు

పీఎం పాలెం: వారాంతపు వినోద కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం 6 గంటలకు శిల్పారామం (జాతర)లో ప్రదర్శించిన కూచిపూడి , జానపద నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను ఆద్యంతం అలరించాయి. స్థానిక జ్యోష్ డాన్స్ అకాడమీలో శిక్షణ పొందిన చిన్నారులు అద్భుత నృత్యంతో ఆకట్టుకున్నారు. కంచాలపై నిల్చుని నృత్యం చేసిన బాల గోపాలం తరంగం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కె. మురళీ గోవింద్ నృత్య దర్శకత్వంలో కళాకారులు మోహన లక్ష్మి, కుశల్, మౌనిక , సంజన, చిన్నారి, ఆశాలత, మన్మిత, గామిని, దివ్య, బిందు నృత్యాలు అలరించాయి.

ఘనంగా క్రీస్తురాజు మహోత్సవాలు



వెలంపేట క్రీస్తురాజు ఆలయంలో ప్రసంగిస్తున్న పాస్టర్లు

తగరపువలస: దేవుని రాజ్యం మన మధ్యే ఉందని, దానికి మనమే వారసులమని అనకాపల్లి జిల్లా అడ్డురోడ్డుకు చెందిన పాస్టర్ యందవ మత్యాస్ అన్నారు. చిట్టివలస, వెలంపేటలోని ఆలయంలో ఆదివారం క్రీస్తురాజు మహోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పలువురు పాస్టర్లు సంఘస్తులను ఉద్దేశించి మాట్లాడారు. రాజు అనేవాడు ప్రజలను రక్షించడం, ఆహారం అందించడం, శత్రువుల నుంచి కాపాడటం చేయాలన్నారు. ఇవన్నీ పూర్తి చేసిన యేసుక్రీస్తు పాపం, మరణం, సైతానును జయించి పునరుత్థానం చెందారన్నారు. ఆయన స్థాపించిన రాజ్యంలో మనందరం దీటుగా జీవించాలని సూచించారు. అంతకు ముందు ఆలయం వద్ద జపమాల అనంతరం పోలిపల్లి, తగరపువలస, తాళ్లవలస, లక్ష్మీపురం, పొడుగుపాలెం, భీమిలికి చెందిన వందలాది మంది వెంటరాగా తేరుతో పుర ప్రదక్షిణ చేశారు. 'నేనే రాజును–ఏది రాజ్యం' నాటికను ప్రదర్శించి, ప్రేమవిందు ఏర్పాటు చేశారు. స్థానిక పాస్టర్ యందవ ఆల్ఫోన్స్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో పాస్టర్లు పెదపూడి ఆంథోనిరాజ్, సిరికి థామస్, గుజ్జల ప్రసన్నకుమార్, స్థానిక పెద్దలు ఎ.శాంతకుమార్, పి.ప్రభాకర్, ఐ.రాజేష్‌కుమార్, దామోదల అప్పారావు, సీహెచ్ రమేష్, పి.జీవన్, పి.హరీష్‌రాజు, రాజ్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

250 మందికి ఉచిత వైద్యపరీక్షలు

తగరపువలస: ఆనందపురం మండలం గండిగుండం గ్రామ పంచాయతీలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరంలో 250 మందికి వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామీణ వైద్యులు లోగిశ గణేష్, పచ్చిపులుసు కన్నారావు, సుధాకర్‌రెడ్డి, కడగల నారాయణరావు, స్వచ్ఛంద సేవకులు గవర రాంబాబు, రామకృష్ణ, ఆస్పత్రుల సిబ్బంది పాల్గొన్నారు.

అర్చకుని కుటుంబానికి అండగా నిలవాలి



అర్చకుని కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న శ్రవణ చైతన్యానంద చిన్నస్వామి

తగరపువలస: చిట్టివలస జ్యూట్‌మిల్లు రామాలయంలో ప్రధాన అర్చకునిగా 40 ఏళ్ల పాటు సేవలు అందించి మరణించిన ఆకెళ్ల నరసింహమూర్తి కుటుంబానికి ఈ ప్రాంతవాసులు అండగా నిలవాలని విజయనగరం జిల్లా నెల్లిమర్ల శ్రీదుర్గా మహాపీఠం ఉత్తర పీఠాధిపతి శ్రవణ చైతన్యానంద చిన్నస్వామి సూచించారు. ఆయన ఆదివారం ఆలయాన్ని సందర్శించి, నరసింహమూర్తి సతీమణి భానుమతి, కుమారుడు రవిగణేష్‌తో మాట్లాడారు. ఈ ప్రాంతవాసులకు నరసింహమూర్తి అందించిన ఆధ్యాత్మిక సేవలను గుర్తు చేసుకున్నారు. అనంతరం ఆయన ఇక్కడ నుంచి అయ్యప్పస్వాములతో కలిసి ప్రత్యేక వాహనంలో శబరిమలై బయల్దేరి వెళ్లారు. యాత్ర నుంచి వచ్చిన తరువాత ఇక్కడివారితో మాట్లాడి అర్చకుని కుటుంబ సమస్యలపై పరిష్కారం చూపేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు.

ఆటోలే శరణ్యం

- పూర్తి స్థాయిలో తిరగని 222 సిటీ సర్వీసులు
- ప్రయాణికుల అవస్థలు



తగరపువలస నుంచి రైల్వే స్టేషన్‌కు నడుస్తున్న 222ఆర్ బస్సు



అంబేడ్కర్ కూడలిలో సిటీబస్సులు లేక ఆటోలను ఆశ్రయిస్తున్న ప్రయాణికులు

తగరపువలస: తగరపువలస నుంచి నగరంలోని పలు ప్రాంతాలకు 222 నంబరు పేరుతో నడుస్తున్న సిటీ సర్వీసులు అందుబాటులో ఉండటం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. వాస్తవానికి ఆర్టీసీ యాజమాన్యం ఉదయం 4.40 గంటల నుంచి రాత్రి 8.55 వరకు 222 సిటీ సర్వీసులు వరుసగా నడుస్తున్నట్టు సమయ పట్టిక ఏర్పాటు చేసినా, దానిని అమలు పరచడం లేదని ప్రయాణికులు అంటున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో తిరిగే బస్సులు 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు అందుబాటులో ఉండటం లేదని అంటున్నారు. దీంతో ప్రయాణికుల్లో ఎక్కువ మంది (కూలీలు, ఉద్యోగస్తులు, వ్యాపారులు) బైపాస్ రోడ్డుకు వెళ్లి ఎక్స్‌ప్రెస్ బస్సులను ఆశ్రయిస్తున్నారు. అంతదూరం వెళ్లలేని వారు, తప్పనిసరి పరిస్థితులలో ఆటోలను ఆశ్రయించి, వాళ్లు అడిగినంత ఇచ్చి జేబులు గుల్ల చేసుకుంటున్నారు. బస్సులు లేని కారణంగా అంబేడ్కరు కూడలి నుంచి ప్రైవేట్ మార్కెట్ వరకు వరుసగా ప్రధాన రహదారిపై ఆటోలు తిష్ట వేస్తున్నాయి. సమయపట్టికలో పేర్కొన్న ప్రకారం గతంలో మాదిరిగా పూర్తి స్థాయిలో 222 సిటీ బస్సులు నగరానికి నడిపించాలని పలు వర్గాల ప్రజలు కోరుతున్నారు.

ఆదమరిచారా.. అంతే..!



రక్షణ దిమ్మలు లేని కల్వర్టు

పద్మనాభం: మండలంలోని బాందేవుపురం సమీపంలోని కల్వర్టుపై రక్షణ దిమ్మలు విరిగిపోవడంతో ప్రమాదం పొంచి ఉంది. మద్ది–అలమండ ఆర్‌ఎస్ రోడ్డుకు అనుసంధానంగా బాందేవుపురం సమీపంలో గెడ్డపై ఉన్న కల్వర్టుకు ఇరువైపులా ఉండే రక్షణ దిమ్మలు విరిగిపోయాయి. ఈ రోడ్డుపై విజయనగరం జిల్లా జామి మండలం అలమండ, కొత్తవలస, పద్మనాభం మండలం కొత్త కొవ్వాడ, గంధవరం, తిమ్మాపురం, మద్ది గ్రామాలకు ఆటోలు, లారీలు, ద్విచక్ర వాహనాలు తిరుగుతూ ఉంటాయి. అసలే రోడ్డు మలుపు.. ఆపై కల్వర్టుకు ఇరువైపులా రక్షణ దిమ్మలు లేకపోవడంతో డ్రైవర్లు ఏ మాత్రం ఏమరుపాటుగా ఉన్నా వాహనాలు గెడ్డలోకి పల్టీగొట్టి ప్రయాణికులు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. సంబంధిత శాఖ అధికారులు తక్షణమే స్పందించి, కల్వర్టుకు ఇరువైపులా రక్షణదిమ్మలను ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

డ్రైనేజీలు శిథిలం



చిట్టివలస రంగూరి లే అవుట్ వైపు చెరువు ముఖద్వారం వద్ద ఆనవాళ్లు లేని డ్రైనేజీ



పెరికివీధి ఇళ్లను ఆనుకుని శిథిలమైన డ్రైనేజీ

తగరపువలస: జీవీఎంసీ ఒకటోవార్డు చిట్టివలస చెరువును ఆనుకుని ముఖద్వారం వద్ద దశాబ్దాల క్రితం నిర్మించిన డ్రైనేజీలు ప్రస్తుతం ఆనవాళ్లు లేకుండా పోయాయి. చిట్టివలస పంచాయతీగా ఉన్నప్పుడు రాళ్లతో నిర్మించిన ఈ డ్రైనేజీ భూమిలో కలిసిపోయింది. వర్షాకాలంలో చెరువుకు నీరు పోటెత్తినప్పుడు ఈ డ్రైనేజీలు రహదారితో సమానంగా కలిసిపోతాయి. చిట్టివలస పంచాయతీ ముందుగా భోగాపురం సమితి, తరువాత భీమిలి మున్సిపాల్టీ, అనంతరం జీవీఎంసీలో విలీనం అయిపోయింది. అయినా పెరికివీధిలో డ్రైనేజీలు అభివృద్ధికి నోచుకోలేదు. రంగూరి లే అవుట్, పెరికివీధి నుంచి వచ్చే వ్యర్థాలు చెరువు ముఖద్వారం వద్ద నిలిచిపోతున్నాయి. దీంతో ఇక్కడి వారు దుర్గంధం భరించలేక తలుపులు మూసుకుని ఇళ్లలో ఉండవలసి వస్తోంది. పెరికివీధిలో చెరువు నుంచి కూడా దుర్గంధం వెదజల్లుతుండటంతో స్థానికులు తరచూ అస్వస్థతకు గురవుతున్నారు. అధికారులు స్పందించి చెరువును ఆనుకుని ఉన్న డ్రైనేజీలను ఆధునీకరించాలని కోరుతున్నారు.